తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శనివారం 19 - 09 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 3

# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజావారధి/శాలిగౌరారం

అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి అంబటి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శాలిగౌరారం మండలం ఇటుకలపహాడ్ గ్రామంలో శుక్రవారం మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించడానికి ఈ




మహాసభలు కీలక వేదిక కానున్నాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, కూలీలకు ఉపాధి, భూమి, సాగునీటి కొరత, పెరుగుతున్న సాగు ఖర్చులు వంటి సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 28న బహిరంగ సభ, 28 నుంచి 30 వరకు జరిగే మహాసభలకు రైతులు, కూలీలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంబటి నర్సయ్య, చింతల ప్రభాకర్, ఆడపు శ్రీను, బండారు మురళి, సింగారపు యాదయ్య, అంబటి యాదమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# గుడిపాటి కవిత కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారంలో ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన గుడిపాటి కవిత కుటుంబాన్ని శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కవిత మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆర్థిక సాయం చేసిన వారిలో గ్రామ సర్పంచ్ శేఖర్ బాబు, సింగల్ విండో వైస్ చైర్మన్ చామల మహేందర్ రెడ్డి, సీఈవో, క్లబ్ అధ్యక్షుడు నిమ్మల ఆంజనేయులు, జోన్ చైర్మన్ డెంకల సత్యనారాయణ, డీసీ మెంబర్ బుడిగె శ్రీనివాసులు, బొడ్డు నగేష్, కప్పల శ్రీకాంత్, జోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
శనివారం
జనరల్ న్యూస్
19 - 09 - 2026




# ఘనంగా పూజలందుకుంటున్న గణనాథుడు

## శాలిగౌరారంలో అన్నదానం

ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారం మండల వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం శాలిగౌరారం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కు చెందిన గుండు పరమేష్‌శివరాణి దంపతులు గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం సర్పంచ్ గుజిలాల్ శేఖర్ బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత ధనుంజయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేష్, ఉపసర్పంచ్ తాటిపాముల పాపరాములు, విగ్రహ దాతలు డెంకల రాములు, డెంకల అంజయ్య, నాయకులు తాందారి సోమేశ్, తిరుపతి, సైదులు, తమ్మిశెట్టి వెంకటేష్, బొల్లికొండ సందీప్, బొడ్డు శంకర్, బొడ్డు నాగరాజు, దండిగిరి రమేష్, పెండ్యాల వెంకన్న, చిలుకూరి నవీన్, నిమ్మల శ్రీను, అనుముల హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రస్మా యాదాద్రి జిల్లా నూతన కమిటీ



## కోశాధికారిగా ఎన్నికైన మోత్కూరు సెయింట్ ఆన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మరియన్న

ప్రజావారధి/మోత్కూరు

తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) యాదాద్రి జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా గొట్టిపర్తి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌డి.సయ్యద్, కోశాధికారిగా మోత్కూరు సెయింట్ ఆన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పసల మరియన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారంతో పాటు విద్యా వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడతామన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయుల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కోశాధికారిగా ఎన్నికైన మరియన్నకు మోత్కూరు ప్రైవేట్ స్కూల్స్ యజమానులతో పాటు పలువురు శుభాకాంక్షలు చెప్పారు.

# మోత్కూరులో కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు

- ఏడుగురు కార్యకర్తలపై ఎఫ్ఐఆర్ నమోదు
- ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే వర్గం నాయకుడు
- కేసులైన ఏడుగురు కార్యకర్తలది వడ్డెర సామాజికవర్గమే
- మున్సిపల్ వైస్ చైర్మన్ టార్గెట్‌గా కేసులు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఏడుగురు కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గం నాయకుల ప్రోద్బలంతోనే భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి వర్గం కార్యకర్తలపై కేసులు నమోదు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ వర్గాల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమన్నట్టుగా విభేదాలు కొనసాగుతుండగా, ఇప్పుడు పోలీస్ కేసుల వరకూ వ్యవహారం వెళ్లింది. ఎమ్మెల్యే వర్గం నాయకులు సంబంధం లేని అంశానికి రాజకీయ రంగు పూసి పోలీస్ కేసులు పెట్టడంపై ఎంపీ వర్గం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అసలేమైందంటే..

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కస్తూర్భా స్కూల్ సమీపంలో ఉన్న సుమారు నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలం చుట్టూ మున్సిపల్ ఫండ్స్‌తో గతంలో రాతి కడీలతో ఫెన్సింగ్ వేశారు. ప్రస్తుతం ఆ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం కోసం డీఎంఎఫ్‌టీ నుంచి నిధులు మంజూరయ్యాయి. దీంతో రాతి కడీలన్నింటినీ (ఇక్కడ మున్సిపల్ నిధులు వృథా అయ్యాయన్నది వేరే విషయం అనుకోండి) తొలగించారు. సుమారు 300 కడీలు ఉండగా అందులో కొన్నింటిని కొందరు దొంగలు మాయం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీకి చెందిన మిగతా కడీలు కూడా చోరీకి గురికాకుండా ఉండేందుకు గాను మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న సీసీ కెమెరాలు ఉన్నచోటుకు వాటిని తరలించేందుకు మున్సిపాలిటీకి చెందిన పలువురు కార్యకర్తలకు ఆ పని అప్పగించారు. వారు ఆ కడీలను పద్మశాలీ కాలనీలో సీసీ కెమెరాలు ఉన్న మసీదు వద్దకు తరలించారు. ఇక్కడే ఎమ్మెల్యే వర్గం నాయకులు రాజకీయానికి తెర లేపారు. ప్రహరీ గోడ పనులు చేస్తున్న వ్యక్తితో మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న కొందరు కార్యకర్తలతో కడీలను దొంగతనం చేయించారని మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఈనెల 16న ఫిర్యాదు చేయించారు. దీంతో కడీలు తరలించే పనికి వెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు ఏడుగురిపై పోలీసులు 17న కేసు నమోదు చేశారు. కేసులు నమోదైన ఏడు కుటుంబాలకు చెందిన వారంతా వడ్డెర సామాజిక వర్గమే. మున్సిపాలిటీకి చెందిన కడీలతో వారికేం సంబంధమని, ఫిర్యాదు చేస్తే మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం చేయాలని, మున్సిపాలిటీతో సంబంధం లేని వ్యక్తి ఫిర్యాదు చేస్తే కేసులు ఎలా పెడతారని ప్రశ్నిస్తున్నారు. కాగా మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్నతో పాటు ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే సామేల్, చైర్మన్ స్వప్నసోమనర్సయ్యతో మొదటి నుంచి తీవ్రంగా విభేదిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల వైస్ చైర్మన్ వెంకన్న సహా కౌన్సిలర్లు మున్సిపల్ నిధులపై విజిలెన్స్ ఎంక్వైరీ చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే వైస్ చైర్మన్ వెంకన్న టార్గెట్‌గా కడీలు తీసుకెళ్లిన కార్యకర్తలపై కేసులు పెడితే ఆయనపై ఆ కుటుంబాలు ఒత్తిడి చేస్తాయన్న లక్ష్యంతో ఎమ్మెల్యే వర్గం నాయకులు ఎత్తుగడ వేశారన్న టాక్ వినిపిస్తోంది. ఎమ్మెల్యేను ఆ కుటుంబాలు బతిమిలాడినా, పైస్థాయి నుంచి ఫోన్లు చేయించినా ఎమ్మెల్యే వర్గం నాయకుల ప్రోద్బలంతోనే వడ్డెర సామాజికవర్గంకు చెందిన ఏడుగురు కార్యకర్తలపై కేసు నమోదైనట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కోసం పని చేశామని, మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే నిలబెట్టిన 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని గెలిపించామని, అలాంటి తమపైనే కుట్ర పూరితంగా కేసులు పెట్టడంపై వడ్డెర సామాజికవర్గం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వర్గం నాయకుల మూలంగా ఇటు వడ్డెర సామాజికవర్గం, అటు ఆర్యవైశ్య సామాజికవర్గం మనోభావాలు దెబ్బతింటే పార్టీ ఓటు బ్యాంక్ దెబ్బతింటుందని కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.